బొంబాయి చూడాలనే
ఆ దంపతుల
సరదా
ఎలా తీరింది?

# చలో బొంబాయి

శ్రీమతి
పి.వి.
శేషారత్నం
కథ

రైలు బొంబాయి వి.టి.లో ఆగింది. జనసందోహంలోంచి ప్లాట్‌ఫారం మీదికి వచ్చేందుకు పావుగంట పైనే పట్టింది సీతారామయ్యగారికి, సుందరమ్మగారికి.

ప్లాట్‌ఫారం మీదికి దిగిన దగ్గర్నుంచీ రెండు కళ్ళూ అప్పగించి ఆ వేలకి వేలు జనాన్ని ఏదో అద్భుత దృశ్యాన్ని చూస్తున్నట్టే చూస్తోంది సుందరమ్మ.

ఆవిడ కడుపు నిండిపోయినట్టుంది. చిన్నప్పట్నుంచీ బొంబాయి చూడాలని ఎంత ముచ్చటో ఆవిడకి-

జీవితపు చరమదశదాకా ఆ కోరిక తీరే అవకాశం మాత్రం రాలేదు.

ఇదిగో భర్త రిటైరైన ఇన్నేళ్ళకి మూడో కొడుకు సుబ్బారావు కనికరం కలగబట్టి బొంబాయి కల ఫలించబోతోంది.


ఎన్నిసార్లు కొడుకులతో నోరువిప్పి అడిగినా అబ్బా ఏంటమ్మా 'ఛస్తోంటే సందెమంత్రం' అని డబ్బులు కుటుంబావసరాలకే చాలక కొట్టుకు ఛస్తుంటే బొంబాయి అంటావు అనేవాళ్లు అంతా.

సీతారామయ్యగారికి పెన్షన్ వస్తున్నా కొడుకుల నీడ కోరుకున్నవాడవడంచేత ఏ కొడుకు దగ్గరుంటే ఆ నాలుగు నెలల పెన్షనూ ఆ కొడుకు చేతిలో పెట్టడం అలవాటు చేసుకున్నాడాయన కోడళ్ల నోటికి భయపడి.

ఇంక పెళ్లాన్ని బొంబాయి ఏం తీసుకెళ్లగలడాయన? వీధిన పడకుండా సంసారాన్ని గుట్టుగా ఈదుకొచ్చి ప్రయోజకుల్ని చేశాడు కొడుకుల్ని. అందుకే ఉద్యోగంలో కూడబెట్టిందేం లేదు.

పెళ్లాం బొంబాయి అన్నప్పుడల్లా ఆయన కొడుకులనే చూపించేవాడు.

ఆఖరికి మూడోవాడు సత్యానికి ఒక ఉపాయం తట్టింది. తనకి ఎల్.టి.సి వుంది.




తల్లిదండ్రులపేర్లుకూడా ఈ ఏడాది రాశాడు తనమీద ఆధారపడ్డట్టుగా.

తనతో కూడా తీసుకెళ్లలేకపోయినా వాళ్లిద్దరికీ టిక్కెట్లు ప్రభుత్వం డబ్బుతో కొని ఇవ్వచ్చు. ఆ నెల పెన్షన్ వాళ్లకే వదిలేస్తే సరి - అన్నిటికన్నా కలిసొచ్చింది ఏమిటంటే పిన్నమ్మ కొడుకు సుబ్రహ్మణ్యం బొంబాయిలో వున్నాడని గుర్తుకు రావడం.

ఆ మధ్య నెల్లాళ్ల క్రితం ఆఫీసు పనిమీద బొంబాయి వెళ్లినప్పుడు వాళ్ల అడ్రసు పట్టుకున్నాడు. తమ్ముడు, మరదలు ఆప్యాయతకు ఎంతో మురిసిపోయాడు. అప్పుడే తన తల్లి మనసులో మాట బయటపెడితే సుబ్రమణ్యమూ, మరదలు నీరజ ఎగిరి గంతేశారు. వాళ్ల పిల్లలు తెగ సంబరపడిపోయారు.

''పిన్ని అన్నాళ్లబట్టి అడుగుతుంటే ఇప్పుడా నువ్వు చెప్పడం - కార్డు ముక్క రాస్తే మేమిద్దరం స్టేషనుకు వచ్చి రిసీవ్ చేసుకుని తెచ్చుకుని ఇంట్లో పెట్టుకోమా? మాకా పెద్దదిక్కు ఎవరున్నారురా పెద్దమ్మని, పెదనాన్నగారిని ఓ నెల్లాళ్లు వుండేలా తప్పక పంపించు. షిర్డీకూడా దగ్గరే. చూపిస్తాను. మా పిల్లలకి చుట్టాలంటే ఎంత సరదా అనుకున్నావ్?

సుబ్రహ్మణ్యం మాటలకి ముందు డంగైపోయాడు సత్యం. బొంబాయిలాంటి మహానగరాల్లో బ్రతకడమే కష్టం. అలాంటిది చుట్టాలొస్తే ఇష్టం అంటాడేవిటి పిచ్చాడు అనుకున్నాడు. ఆఫీసు పనిమీద వున్న నాలుగురోజుల్లో హోటల్లో వుండనీలేదు వాళ్లు.

ఆ ఒక్క చిన్న ప్రాబ్లమ్ తప్ప - ఫరవాలేదు తల్లినీ తండ్రినీ పంపిస్తే ఆ ఘనత తనకే దక్కుతుంది అనుకున్న సత్యం ఊరునుంచి వచ్చాక తల్లీ తండ్రీ చెవిలో అంగీకారాన్ని ఊదాడు.

అప్పట్నుంచీ సుందరమ్మగారి సంబరం అంతా ఇంతా కాదు. చిన్నప్పుడు వాడికిష్టమని పెరుగుమీద మీగడ సత్యానికేవేసేది. ఎప్పటికైనా వాడే బొంబాయి చూపించాలి అని తన నమ్మకం ఇలా తీరుతోంది అన్నమాట.

''కాని ముసలాళ్లం ఇద్దరం...'' నసగబోయిన భర్తను ఆపేసింది ఆవిడ.

''వాడికి సెలవుండద్దా మన వెంట తిరగడానికి. అయినా సుబ్రహ్మణ్యం చిన్నప్పుడు నా చేతుల్లో పెరిగాడు. వాడి గురించి మీకు దిగులక్కరలేదు''

''నిజమే నాన్నా! వాడు రిప్లయికూడా రాసేశాడు పంపమని. ఓ నెల్లాళ్లదాకా వాళ్ల పిల్లలకీ సెలవులేనట. మీకూ బాగా ఊసుపోతుంది. మీరు కోణార్క్‌కి వస్తున్నట్లు టెలిగ్రాంకూడా ఇచ్చాను'' అన్నాడు సత్య.

''షిర్డీకూడా తీసుకెళ్తానన్నాడటండీ. ఎంతైనా సుబ్రహ్మణ్యం అభిమానమే వేరు''

సుందరమ్మ వాగ్దాటిలో ఓ గంట కొట్టుకుపోయాడు సీతారామయ్యగారు.

ఎన్నో జాగ్రత్తలు చెప్పి అడ్రసు నాలుగైదుచోట్ల రాసి మరీ బండెక్కించాడు సత్యం.

''దొడ్డమ్మా. బాగున్నావా?''

''అత్తయ్యగారూ మావయ్యా ప్రయాణం బాగా జరిగిందా?'' సుందరమ్మ, సీతారామయ్యలు ఈ లోకంలోకి వచ్చారు.

ఎదురుగా సుబ్రహ్మణ్యం, నీరజ.

అసలు సిసలైన తెలుగు వేషాలు.

ప్రాణం లేచొచ్చింది వాళ్లిద్దరికీ. తెలుగు మాట చెవిన పడేసరికి హమ్మయ్య నా భయం తీరిందమ్మాయ్. ఈ జనాన్ని చూస్తోంటే గుండెల్లోంచి దడొచ్చేసిందనుకో. పైగా మాకా భాషరాదు. మీరు రాకపోతే మా పని ఇంతే''

''భలేవారే. మీ అబ్బాయి తిరుగు టెలిగ్రాం ఇచ్చారుగా మిమ్మల్ని రిసీవ్ చేసుకుంటాం...ని'' అంది నీరజ.

నిజంగా సుందరమ్మగారికీ సీతారామయ్యగారికీ ఆ దంపతులిద్దరూ ఆదికాలపు జంటలా అనిపించారు. ఈ కాలం అతిథి మర్యాదలుకూడానా. చుట్టం అంటే దయ్యంలా చూసే రోజులివి.

చెల్లెలికి ఆయుష్షే లేకపోయిందిగాని ముత్యంలాంటి కొడుకు, కోడలూ.

''మావమ్మగారూ - తాతయ్యగారూ నమస్కారం'' లేత కంఠాలు వినిపించాయి.

''మా పిల్లలు నాని, బుజ్జి. బాబుకి ఐదు పాపకి నాలుగేళ్లు''

పిల్లలు ఎర్రగా కమలాఫలాల్లా వున్నారు.

సినిమాల్లో చూపించే పిల్లల్లా ముద్దొచ్చేస్తున్నారు. వృద్ధ దంపతులు ఆగలేక చెరొకర్ని ఎత్తేసుకున్నారు.

ఆటోలో వాళ్ల చిలకపలుకులు స్వచ్ఛమైన తెలుగు వింటుంటే అసలు తాము వచ్చింది బొంబాయికేనా'' అని అనుమానమొచ్చింది వాళ్లకి.

సుబ్రహ్మణ్యం, నీరజ ఇద్దరూ ఉద్యోగస్థులే. ఆరోజు ఆదివారం మూలాన ఇంట్లో కబుర్లు చెప్తూ వుండిపోయారు.

బొంబాయిలో ఏవేం చూడవచ్చునో, ఎంతెంత దూరాల్లో వుంటాయో, చుట్టాలుంటే తప్ప ఎంత కష్టమో ఈ ఊరువచ్చి విడిగా తీసుకుని వుండాలంటే - రోజుకి నాలుగు వందలకి ఎంత చండాలపు గది దొరుకుతుందో అన్నీ చెప్తుంటే నోరు తెరుచుకుని వింటున్నారు సుందరమ్మ, సీతారామయ్యలు.

నిజంగా వీళ్లు ఇక్కడ లేకపోతే ఈ జీవితంలో బొంబాయి కోరిక తీరడం వట్టిదే.

శని ఆదివారాలు వచ్చినప్పుడల్లా వాళ్లిద్దరికీ అన్నీ చూపిస్తామని ప్రామిస్ చేశాడు సుబ్రహ్మణ్యం.

అసలు నీరజనీ, నాని బుజ్జిలను చూస్తుంటే ఎంతో మురిపెంగా అనిపించింది.


ఎంతో మర్యాదగా, మొహమాటపెట్టకుండా అడుగడుక్కీ అన్నీ అమర్చే నీరజలాంటి కోడలుంటే జీవితం ధన్యం అనిపించింది సుందరమ్మకి తన కోడళ్లతో పాట్లు గుర్తొచ్చి -

పిల్లలయితే అసలు బల్లుల్లా కరుచుకుపోతున్నారు తప్ప వదలట్లేదు.

''అత్తయ్యగారూ! పిల్లలకి సెలవులు కనుక వాళ్లని స్కూలుకు దింపే పనిలేదు. మీకూ ఊసుపోతుంది. అన్నీ డైనింగ్ టేబుల్‌మీద పెట్టాను. ఏమీ వెతుక్కోనవసరంలేదు. టీకూడా మధ్యాహ్నానికి కలిపి ఫ్లాస్కులో పోసేశాను. స్టీలు డబ్బాలో కారప్పూస, లడ్డూలున్నాయి. మామ్మనీ, తాతయ్యనీ జాగ్రత్తగా చూసుకోండి''

అప్పగింతలు పెట్టి వెళ్లిపోయింది నీరజ.

''పిన్నీ మళ్లీ సాయంత్రం ఏడవుతుంది వచ్చేసరికి'' సుబ్రహ్మణ్యం కేరేజి పట్టుకుని నీరజననుసరించాడు.



పిల్లలూ వృద్ధ దంపతులూ మిగిలారు.

''తాతయ్యా నీకు 'మాయాబజార్' సినిమా ఇష్టమేనా?''

''ఇష్టమేరా నాన్నా చిన్నతనంలో చూశాను''

''మేమిప్పుడు విసిపిలో వేస్తే చూస్తారా?'' అంది ఆరిందాలా బుజ్జి.

''మీరా? సినిమా ఎక్కడిది? ఎలా వేస్తారు?''

''అయ్యో మీకు తెలీదు. మా ఇంట్లో కేసెట్ వుందిగా'' అన్నాడు నాని.

అనడమే తడవు ఒక స్టూలు తెచ్చి పక్క రూంలోకి ఈడ్చుకెళ్లి కేసెట్ తీసి వి.సి.పిలో పెట్టి ఆన్ చేస్తుంటే కలో నిజమో అర్థంకాలేదు సుందరమ్మకి.

అలవాటున్నట్టుగా ఇంత చిన్నపిల్లలు అలా చకచకా అన్నీ తెలిసినట్టు వేసేస్తుంటే ముందు కాస్త భయపడింది.

''చిన్నపిల్లలు - ఏదైనా పాడయితే ఎంత కష్టం - పెద్దవాళ్లు మీరేం చేస్తున్నారు'' అంటారేమో నీరజ, సుబ్రహ్మణ్యం.

కాని ఆవిడ ఆలోచన తెగేలోగా మాయాబజార్ సినిమా మొదలైంది. ఇంక పిల్లల్తోబాటు వాళ్లూ లీనమైపోయారు.

సినిమా అయేసరికి రెండయింది.

ఆకలి తెలిసింది అందరికీ. పిల్లలకి, భర్తకీ వడ్డించేసింది.

''మా బంగారు బొమ్మలర్రా మీరిద్దరూ? మళ్లీ చిన్నతనంలోకి వెళ్లిపోయాం. మాయాబజార్ ఏనాటి సినిమా!''

వాళ్ల బుగ్గల్ని ముద్దాడింది సుందరమ్మ. సుందరం స్వర్గం అంటే ఇదేనే? అన్నారు తేనుస్తూ సీతారామయ్యగారు.

''మీకు కృష్ణలీలలు ఇష్టమేనా?'' అన్నాడు నాని అన్నం తిన్నాక స్టూలు ఎక్కుతూ.

''ఇష్టమే. కాని కాసేపు నడుం వాలిస్తే...'' నిద్రకూడా వస్తోంది వాళ్లకి.

వెంటనే గయ్యిమని రాగం అందుకుంది బుజ్జి. ఉలిక్కిపడ్డారిద్దరూ.

బుజ్జి ఏడుపు కడుపు తరుక్కుపోయేలా వుంది.

'కిట్టలీలలు కావాలి' అంటూ ఒకటే రాగం.

''వేస్తానుండవే, మామ్మ తాతలు ఒప్పుకోనీ'' అన్నాడు పెద్దరికంతో నానీ.

''పోనీ కుర్రదాన్ని ఏడిపించడమెందుకు వెయ్యరా నానీ'' అన్నాడు సీతారామయ్య.

'కృష్ణలీలలు' మొదలయింది. సినిమా ఎంతో ఉత్సాహంగా ఉన్నా నడుములు పీక్కుపోతున్నాయిద్దరికీ. కానీ పడుకుని చూసేందుకు ఒప్పుకోలేదు నానీ బుజ్జి-

కాస్త జోగుతున్నా తట్టి లేపేసి ''ఇప్పుడు చూడు మామ్మా కిష్టుడు అంత పైకెగిరి కాళీయుడిమీద బ్యూటిఫుల్ డాన్స్ చేస్తాడు''

''తాతా గోపికల చీరలెత్తుకుపోతున్నాడు కిష్టుడు నిద్రపోకు''

బుజ్జి, నాని చెరొకళ్లని పట్టుకుని కూర్చున్నారు. సినిమా అయేసరికి నీరజ, సుబ్రహ్మణ్యం నవ్వుకుంటూ వచ్చారు.

''పిల్లలు ఏమీ ఇబ్బంది పెట్టలేదుకదా!'' అంది ఎంతో మర్యాదగా నీరజ.

''భలేదానివమ్మా - నేనేం గొడ్రాలినా? పదిమందిని ఈ చేతిమీద పెంచినదాన్ని'' అంది సుందరమ్మ గర్వంగా.

''అవునను సుబ్రహ్మణ్యం! పిల్లలు మయత్యాలనుకో. ఎంత చురుకో - అంతా బొంబాయి మహిమ'' అన్నాడు సీతారామయ్యగారు.

అయితే వారం తిరిగే సరికి వాళ్లిద్దరి కళ్లు పీక్కుపోవడం మొదలెట్టాయి.

అన్ని పనులూ చేసి సకల సౌకర్యాలు చేస్తున్న భార్యాభర్తలతో ఏం చెప్పాలో అర్థంకాలేదు వృద్ధ

దంపతులకి.

వాళ్లు ఆఫీసుకెళ్లడం మొదలు ''తాతా కంబళి గింబళి సినిమా చూద్దామా అంటాడు నాని అంటే మాయాబజారన్నమాట.

వద్దు అనే వీల్లేదు. బుజ్జి రాగం మొదలెడుతుంది.

ఒకటికి రెండుసార్లు పక్క క్వార్టర్లవాళ్లు తొంగిచూశారు. తలుపుకొట్టి బుజ్జి రాగానికి.

వాళ్ల ఆకారాలు చూసి హడలిపోయారు ఇద్దరూ. ''పిల్లల్ని ఏడిపిస్తారేంటి'' అన్నట్టున్నాయి వాళ్ల చూపులు. రోజా పొద్దుట మాయాబజార్, మధ్యాహ్నం కృష్ణలీలలు.

అందులో సీన్లు - డైలాగులతో సహా కంఠస్థం వచ్చేశాయి దంపతులకి.

పిల్లలకి అదేం పిచ్చి ఇష్టమోగాని రెప్ప వాల్చకుండా కిక్కురుమనకుండా రోజూ చూస్తున్నారు అవే సినిమాలు.

రాత్రి భోజనాలదగ్గర ఆ సినిమాల డైలాగులు చెప్తుంటే తల్లీదండ్రీ తెగ మురిసిపోవడం.

పిచ్చెక్కిపోతోంది వాళ్లకి.

శనివారం మధ్యాహ్నం బయటకి తీసుకెళ్దామనేసరికి వృద్ధుల ప్రాణం లేచొచ్చింది. 'కృష్ణలీలలు' తప్పింది కదాని.

''వద్దమ్మా'' అన్నాడు చిద్విలాసంగా నవ్వుతూ నాని - ఇవాళ పొద్దుట ఏడు గంటలనుంచే సినిమాలు మొదలు. మధ్యాహ్నం బయటకెళ్తాంగా'' అంది బుజ్జి తిప్పుకుంటూ.

వాళ్ల గుండెలు గుభేల్మన్నాయి.

నీరజ, సుబ్రహ్మణ్యాలు వినిపించనట్టు పనుల్లో సర్దుకున్నారు. ఇక శని, ఆదివారాలు బొంబాయి అంతా తిప్పారు నీరజ, సుబ్రహ్మణ్యం. బోల్డు దూరాలు నడిస్తేగాని బస్‌స్టాప్‌లు రావు. ఈ లోగా నాని, బుజ్జి, సుందరమ్మ, సీతారామయ్యల చంక లెక్కడమే. ఎత్తుకునే వయసుకాదు. నడిచే వయసుకాదు పిల్లలది.

తల్లీ దండ్రీ బ్రతిమాలినా వినడంలేదు. బుజ్జి రాగం ఎత్తుకుంటే నీరజ చెవులు మూసుకుంది. సుందరమ్మ విస్తుపోయింది.

''అమ్మో అత్తయ్యగారూ ఇది నోరు విప్పితే నాకు భయం. అందుకే ఏడవనివ్వను. ఒకసారేమయిందనుకున్నారు. ఇలాగే వీధిలో ఏడుపు మొదలెట్టేసరికి మేమిద్దరం పిల్లల్ని

## పెళ్ళికూతురు

''ఏమిటి ముప్పై లక్షలు కట్నం ఇస్తారా... మరి పిల్లకు వెనకా ముందు ఎవరైనా వున్నారా?''

''ఆ... ఉన్నారు... ఒక కొడుకు... కూతురు...''

''ఆ!!''

-మాడిశెట్టి బ్రదర్స్ (నర్సరావుపేట)



ఎత్తుకుపోయేవాళ్లమనుకుని పోలీస్ స్టేషన్‌కి అప్పగించారు చుట్టూ ఉన్నవాళ్లు. మేం వాళ్ల తల్లిదండ్రులమే అని రుజువు చేసుకునేసరికి తాతలు దిగొచ్చారు.

నీరజ నవ్వులతో సుబ్రహ్మణ్యం జతకలిపాడు.

కాని వృద్ధ దంపతులకి నవ్వురాలేదు. పక్కింటి వాళ్ల క్రూరమైన చూపులు గుర్తుకు వచ్చాయి.

శని ఆదివారాలు గడచి సోమవారం మొదలయ్యేసరికి హింస మొదలు. మాయాబజార్ కృష్ణలీలలు నడుం పీక్కుపోవడం, కళ్లు పొడారిపోవడం కలత నిద్రలోకూడా శకుని - కంసుడు తప్ప ఎవరూ రావడంలేదు కలల్లో.

రెండువారాలు గడిచేసరికి సీతారామయ్యగారు ''బాబూ సుబ్రహ్మణ్యం'' అనబోయారు ''వెళ్లిపోతాం'' అని చెప్పాలని.

''బాబాయిగారూ శని ఆదివారాలు షిర్డీకి టిక్కెట్లు బుక్‌చేశాను'' అని వెళ్లిపోయాడు హడావుడిగా.

షిర్డీ అయిపోయాక సుందరమ్మ నోరు విప్పింది. ''అమ్మా నీరజా... సత్యం కూతురు బెంగెట్టుకుంటుంది. రాత్రి కల్లోకొచ్చిందికూడా. రేపు వెళ్లిపోతాం అమ్మాయ్''

భలేవారే వారం ముందయినా అయితేగానీ రిజర్వేషన్ దొరకదు. అదీగాక సత్యం బావగారు నిన్న లెటర్ రాశారట. ఆఫీసులో మర్చిపోయారాయన. వాళ్లంతా ఈసారి వాళ్ల అత్తారింటికి వెళ్తున్నారట సెలవులకి''

సుందరమ్మ గొంతులో పచ్చి వెలక్కాయ పడింది.

ఉదయం పది అవుతోందంటే సీతారామయ్యగారికి దడ వచ్చేస్తోంది. మాయా బజార్ తల్చుకుని.

మరో పదిహేను రోజుల తర్వాత సుబ్రహ్మణ్యం రెండు టిక్కెట్లు చేతిలో పెట్టాడు వాళ్లకి. ఈ రశీదులు జాగ్రత్తగా సత్యానికివ్వండి. ఎల్.టి.సి కదా!

''అత్తయ్యగారూ మీ పుణ్యమా అని పిల్లల సెలవులు గడిచిపోయాయి. మీకెప్పుడు బొంబాయి రావాలన్నా మమ్మల్ని మర్చిపోకండి'' అంది కొత్త చీర, జాకెట్టు ముక్క బొట్టుపెట్టి ఇస్తూ నీరజ. సీతారామయ్యగారికి కూడా కొత్త బట్టలు పెట్టి నమస్కారం చేశారు దంపతులు.

పిల్లలూ దణ్ణం పెట్టారు బండెక్కాక.

''తాతయ్యా మామ్మా మీ అంత మంచి చుట్టాల్ని మేమెప్పుడూ చూళ్లేదు. మాకెప్పుడు సెలవులిచ్చినా మీరు బొంబాయి రావాలి''

''రాకపోతే'' అంది కొంటెగా నవ్వుతూ బుజ్జి.

''అమ్మో ఏడవకు తల్లీ'' చుట్టూ భయంగా చూశారు పెద్దవాళ్లిద్దరూ.

వాళ్లు జాగ్రత్తగా ఊరెళ్లాక నెల్లాళ్లకి సత్యం ఉత్తరం రాశాడు.

''సుబ్రహ్మణ్యం!

బొంబాయి చూసి అమ్మా నాన్నా ఎంత మారిపోయారో తెలుసా? వాళ్ల పెన్షన్‌లోంచి నెలనెలా వాయిదాల్లో కట్టమని ఓ వి.సి.పి, రెండు సినిమా కేసెట్లు కొనిపించారు. అవేమిటో తెలుసా మాయాబజార్, కృష్ణలీలలు. ఈ లోగా పిచ్చెత్తిపోయారు. ఏదో పోగొట్టుకున్నట్టుగా రోజూ వాళ్లు చేసే పనేమిటో తెలుసా? పొద్దుట మాయాబజార్, మధ్యాహ్నం కృష్ణలీలలు - రాత్రి కంసుడా? శకునీ అంటూ కలవరింతలు''

నీరజా సుబ్రహ్మణ్యంలు ఫక్కున నవ్వారు. మళ్లీ సెలవులకి ఏ చుట్టాల్ని వెతకాలో మన నాని, బుజ్జిగాళ్లకి ఆహారంగా... ఆలోచనలోపడ్డారిద్దరూ.